
# తహసీల్దార్ కార్యాలయం తరలింపు సరికాదు

బడంగ్‌పేట, మే21: బాలాపూర్ లో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని బడంగ్‌పేటకు తరలించిన పాపం కాంగ్రెస్ పార్టీ దేనని బాలాపూర్ అఖిల పక్ష నాయకులు ఆరోపించారు. మంగళవారం బాలాపూర్ పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిల పక్ష నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. గతంలో బాలాపూర్‌కు మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మీర్‌పేటకు తరలించారన్నారు. బాలాపూర్‌కు వచ్చిన పోలీస్ స్టేషన్ ను మల్లాపూర్‌కు తరలించారన్నారు. బాలాపూర్‌లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఇతర ప్రాంతాలకు తరలించి బాలాపూర్ ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారని వాపోయారు. బాలాపూర్ గ్రామంలో ఉన్న ప్రజా ప్రతి నిధులు తహసీల్దార్ కార్యాలయం గురించి నోరు మెదపక పోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బాలాపూర్ ప్రజా ప్రతినిధులకు ఓట్ల తర్వాత పైసలు తప్ప ప్రజల సమస్యలు వారికి పట్టవన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటే కండ్లులేని కబోదులుగా బాలాపూర్ ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్నారన్నారు. బాలాపూర్‌కు సంబంధించిన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉండి ఎందుకు ఖండించలేదన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు ఎందుకు చెప్పలేదో వారు సమాధానం చెప్పాలన్నారు. కార్పొరేషన్‌లో తీర్మానం చేసినట్లు చెప్పడం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ ఉండగా కార్యాలయాన్ని ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. బాలాపూర్ ప్రజా ప్రతినిధులు త్వరలో తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు కొలన్ శంకర్ రెడ్డి, (బీజేపీ) బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంగేటి లక్ష్మారెడ్డి,(బీఆర్ఎస్)బడంగ్‌పేట కోఆప్షన్ సభ్యులు రఘునందన చారి, రజక సంఘం నాయకులు బాలరాజ్, గడ్డం వెంకటేశ్, అత్తాపూర్ శ్రీనివాస్ రెడ్డి, చిగిరింత నర్సింహారెడ్డి, దొడ్డి శ్రీశైలం, తిమ్మని గిరీశ్, గుండె నాగార్జున, విజయ్, అరవింద్ కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింహ, కృష్ణ, బొర్ర రవి, తదితరులు పాల్గొన్నారు.



బాలాపూర్‌లో నిరసన తెలుపుతున్న అఖిల పక్షనాయకులు



బాధితులకు ఫోన్లు అందజేసిన ఏసీపీ కాశిరెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి

## 31 ఫోన్లు రికవరీ

వనస్థలిపురం, మే 21 : చోరీకి గురైన 31సెల్ ఫోన్‌లను రికవరీ చేసిన వనస్థలిపురం పోలీసులు మంగళవారం బాధితులకు అందజేశారు. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు చోట్ల జరిగిన సంఘటనల్లో ఫోన్‌లు పోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఫోన్‌లు ఎంతో కీలకంగా మారాయన్నారు. సమాచార వ్యవస్థతోపాటు వ్యక్తిగత సమాచారం కూడా అందులో ఉంటుందన్నారు. జనం ఎక్కువగా ఉండే చోట ఫోన్ చోరీలకు గురవుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫోన్లను రికవరీ చేసిన వనస్థలిపురం సీఐ అశోక్‌రెడ్డి, డీఐ, ఎస్ఐలను ఏసీపీ అభినందించారు.

## నేడు, రేపు ఫణిగిరి లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణోత్సవం

ఎల్బీనగర్ , మే 21: చైతన్యపురిలో మూసీ నది పక్కన స్వయంభువుగా వెలసిన శ్రీ ఫణిగిరి కొసగుండ్ల లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో బుధ, గురువారాల్లో స్వామివారి జయంతి, కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మూసీ నది ఒడ్డున కొసగుండ్ల మధ్యలో వెలసిన శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి వారి ఆలయానికి ఎంతో ప్రశ్యస్తం ఉన్నది. బుధవారం స్వామి వారి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు క్షీర పంచామృతాభిషేకం, కుంభం, నర్సింహా జ్యోతి, ఉదయం 9 గంటలకు సమస్త పీడా నివారణ పూజలు, సుదర్శన హోమం కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. గురువారం ఉదయం పదకొండు గంటలకు స్వామి వారి కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**యాదగిరి గుట్ట నుంచి స్వామి వారికి పట్టు వస్త్రాలు**

కల్యాణ మహోత్సవానికి యాదగిరి గుట్ట నుంచి స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు యాదగిరి గుట్ట ఈవో సంబంధిత అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. స్వామి వారి కల్యాణం కోసం ఆలయం వద్ద అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటామని కమిటీ చైర్మన్ కుందూరు కృష్ణారెడ్డి తెలిపారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, మే 21 : వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకుగాను విద్యుత్ మరమ్మతు పనుల నిమిత్తం బుధవారం ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డివిజన్ డీఈ హనుమంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఎస్‌వీ నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 12 : 30 గంటల వరకు, 11కేవీ సిరిపురం కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు, 11కేవీ ఆంధ్రా బ్యాంక్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4: 30 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**కందుకూరులో....**

కందుకూరు, మే 21 : మండల కేంద్రంలో గల 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని కందుకూరు టౌన్, కొత్తగూడ ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ రమేశ్ గౌడ్ తెలిపారు. చెట్ల కొమ్మలు నరికివేయడం వల్ల ఉదయం 10 గంటల నుంచి 12 వరకు టౌన్ ఫీడర్, 12గంటల నుంచి 2గంటల వరకు కొత్తగూడ టౌన్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు, రైతులు, వర్తక, వాణిజ్య దారులు సహకరించాలని ఆయన కోరారు.

## మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్, మే 21: స్వర్ణభారత్ ట్రస్టులో మహిళలకు ఉచితంగా మగ్గం వర్క్‌పై శిక్షణ ఇస్తున్నట్లు స్వర్ణభారత్ ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వర్ణభారత్ ట్రస్టు-యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సంయుక్తంగా మగ్గం వర్క్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు వారికి మాత్రమే అవకాశం ఉందన్నారు. రేషన్, ఆధార్‌కార్డుల తోపాటు ఈనెల 24న ఉదయం 9.30 గంటలకు శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ స్వర్ణభారత్ ట్రస్టు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. 19 నుంచి 45ఏండ్ల వరకు అవకాశం ఉందన్నారు. 30 రోజుల పాటు ఉచితంగా భోజనంతో పాటు వసతి సౌకర్యం ఉంటుందని తెలిపారు.



## పాఠశాలకు బోరు మోటర్ ప్రదానం

కందుకూరు, మే 21 : మండల పరిధిలోని చిప్పలపల్లి ప్రభుత్వ పాఠశాలకు బోరు మోటర్‌ను ప్రదానం చేశారు. పాఠశాలలో బోరు మోటర్ చెడి పోవడంతో విద్యార్థుల తాగునీటి ఇబ్బందులు గుర్తించి విద్యార్థులకు దాహార్తి తీర్చడానికి స్వశోధన్ ట్రస్టు సభ్యులు ముందుకు వచ్చి రూ. 36వేలతో 2 హెచ్‌పీ, మోటర్, పంప్ సెట్,పైపులను అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శివవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి పాఠశాలకు మోటర్, పైపులను అందజేయడం పై హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

ఎల్బీనగర్ , మే 21: కొత్తపేట న్యూ మారుతీనగర్‌లోని శ్రీ బంగారు గవ్వల రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు, కల్యాణ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కట్ట వెంకటేశం, కట్టా ఎల్లీశ్వరి, జీహెచ్ఎంసీ మాజీ వార్డు కమిటీ సభ్యుడు విజయరంగ, తిరుమల్‌రెడ్డి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## రోడ్డు కబ్జాను ఆపాలి

కందుకూరు, మే 21 : రోడ్డు కబ్జాను ఆపాలని మండల పరిధిలోని నేదునూరు రైతులు ఆర్డీవో సూరజ్ కుమార్, తహసీల్దార్ గోపాల్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాల్దాని కుంట తండావరకు వెళ్లే రోడ్డు ఆక్రమణకు గురవుతుందని తెలిపారు. మండల పరిధిలోని నేదునూరు రెవెన్యూ గ్రామంలో విద్యుత్ సిబ్బంది కొంత మంది 72 ఎకరాలు కొనుగోలు చేశారని, పక్కన గల రోడ్డు కబ్జా చేయాలని చూస్తున్నారని ఈ రోడ్డుపై నడవడానికి పూర్వం నుంచి నక్షబాట ఉందని దీనిని కాపాడి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ విషయాన్ని పరిశీలిస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు. వెంకటయ్య, క్రిష్ణనాయక్, ఎగిరిశెట్టి నర్సింహ,రాకేశ్‌గౌడ్,శ్రీనివాస్‌రెడ్డి, భిక్షపతి, చంద్రారెడ్డి, శ్రీశైలం ఉన్నారు.

## విద్యుత్ కోతలతో జనం విలవిల

ఎల్బీనగర్ , మే 21: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆర్కేపురం విద్యుత్ సెక్షన్ పరిధిలో అప్రకటిత విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి. కరెంటు అసలు పోవడం లేదంటూ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఓవైపు పేర్కొంటుంటే ఈ సెక్షన్ పరిధిలో మాత్రం నిత్యం ఏదో ఒక సమయంలో కరెంటు కోత ఉంటుంది. ఇక వర్షం పడితే సరేసరి... నిర్వహణ పనుల నిమిత్తం తగిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ విషయాన్ని ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా కరెంటు కోతలు విధిస్తున్నారు. గతంలో కరెంటు సరఫరాను ఆపేసి చెట్లను కొట్టేందుకు, నిర్వహణ పనులు చేపట్టేందుకు సంబంధిత అధికారులు ముందస్తుగానే సమాచారం ఇచ్చి కరెంటు కోతలు విధించే వారు ప్రస్తుతం అధికారులు ఈ దిశగా పనిచేస్తున్నట్లు కన్పించడం లేదు. చెట్ల కొమ్మలు కొడుతున్నాం.. అందుకే కరెంటు కోతలు చేశామని, మరో గంటలో వస్తుంది అంటూ పేర్కొంటున్నారు. విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి కరెంటు కోతల విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తే బాగుంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. వేసవిలో కరెంటు పోతే ప్రజలు విలవిలలాడుతున్నారు.

## వీరాంజనేయ స్వామి ఆలయంలో చోరీ

మాదన్నపేట, మే 21: కుర్మగూడ డివిజన్ మాదన్నపేటలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో దొంగలు హుండీ పగలకొట్టి కానుకలు, నగదు ఎత్తుకెళ్లారు.సోమవారం సాయంత్రం దేవాలయం శుభ్ర పరుస్తుండగా హుండీ తెరిచి ఉండడంతో దేవాలయ సిబ్బంది కమిటీ సభ్యులకు తెలిపారు. వెంటనే కమిటీ సభ్యులు మాదన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నెలలు గడిచినా రోడ్డు వేయడం లేదు..



అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ సభ్యులు

బడంగ్‌పేట, మే21: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ గుర్రంగూడ ఆదిత్య నగర్ లో సీసీ రోడ్డు వేసేందుకు దొడ్డు కంకర వేసి నెలలు గడిచినా రోడ్డు వేయడం లేదని ఆదిత్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. రోడ్డు వేయడానికి పనులు ప్రారంభించి సంవత్సరం గడుస్తున్నా ఇంత వరకు పూర్తి చేయలేక పోయారన్నారు. దీంతో ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా ఉందన్నారు. కంకర వేయడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. రోడ్డు వేయకుండా ఎందుకు పనులు నిలిపివేశారో ఎవరికి అర్థం కావడం లేదన్నారు. అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి గుర్రంగూడ ఆదిత్యనగర్ రోడ్డును వేయించాలని కోరారు. ఇప్పటికే సీడీఎంఏకు, బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశామని తెలిపారు. శ్రీనివాస్ చౌదరి, శ్రీనివాస్ చారి, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## సేవాభావం అలవర్చుకోవాలి



రామ్మోహన్‌కు గ్లోబల్ ఐకాన్ అవార్డును అందజేస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు

ఆర్కేపురం, మే 21 : ఆపదలో ఉన్న వారిని ఆదుకొని స్వచ్ఛందంగా సహాయం చేయడంతో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ధరణి అధ్యక్షుడిగా సేవలందించినందుకు గాను కోట్ల రామ్మోహన్‌కు గ్లోబల్ ఐకాన్ అవార్డు వరించింది. శ్రీ మంజునాథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు ఈ అవార్డును అందజేసినట్లు రామ్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. సేవ చేయడంలోనే ఎంతో సంతోషం ఉంటుందన్నారు. తాను చేస్తున్న సేవలను గుర్తించి శ్రీ మంజునాథ ఫౌండేషన్ తనకు ఈ వార్డును ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇదే ఉత్సాహంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతానని తెలిపారు.

## రోడ్లపైనే చెట్ల కొమ్మలు..రాకపోకలకు ఇక్కట్లు



ఏఈ జ్యోతితో కలిసి పరిశీలించిన కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, మే 21 : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది అలసత్వం కారణంగా వారం రోజులుగా కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. వారం క్రితం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా చెట్ల కొమ్మలు కొట్టివేసి కాలనీ వీధుల్లోనే పడేయడంతో స్థానికంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ జ్యోతితో కలిసి మంగళవారం సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొట్టివేసిన చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు సిబ్బంది తొలగించేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి అధికారులను కోరారు.

## విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

మైలార్‌దేవ్‌పల్లి, మే 21: మార్షల్ ఆర్ట్స్ ఆత్మరక్షణతో పాటు శరీర దారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. రెండో జూనియర్ ఇంటర్ డ్రిస్టిక్ట్ విష్యూ చాంపియన్‌షిప్ 2024లో మైలార్‌దేవ్‌పల్లిలోని మహవీర్ మార్షల్ ఆర్ట్స్ అకాడామీ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభకనబరిచారు. ఇటీవల నిజామాబాద్‌లో అమెచ్యూర్ విష్యూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. అకాడమీకి చెందిన ఎ.జయవర్ధన్ ఉత్తమ ప్రతిభకనబరిచి బ్రాంజ్ మెడల్ సాధించాడు. మంగళవారం విజేతతోపాటు పాటు కోచ్ సంతోష్‌యాదవ్‌లను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బండ రాజేశ్‌యాదవ్ తదితరులున్నారు.



మార్షల్ ఆర్ట్స్‌లో సిల్వర్ మెడల్స్ సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్



మీర్‌పేట చౌరస్తాలో రాజీవ్ గాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, చల్లా నర్సింహారెడ్డి



కందుకూరులో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్పీటీసీ జంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు

# రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లింగాల నాగేశ్వర్‌రావు, కొత్తపేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిశోర్ గౌడ్

ఎల్బీనగర్ , మే 21: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయమని ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లింగాల నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా కొత్తపేటలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కొత్తపేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల కిశోర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లింగాల నాగేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రెడ్డి జేఏసీ చైర్మన్ బద్దురి వెంకటేశ్వర్‌రెడ్డి, చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండ సురేందర్‌రెడ్డి,షరీఫ్, విజయరంగ, రవికేశవ్, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కృష్ణమూర్తి, కరీం, కృష్ణారెడ్డి, భాష, సామలేటి సాయి, జావీద్, ప్రవీణ్, నవీన్, సాయితేత తదితరులు పాల్గొన్నారు.

**బాలాపూర్ మండల పరిధిలో...**

బడంగ్‌పేట్: బాలాపూర్ మండల పరిధిలోని మీర్‌పేట చౌరస్తా, బడంగ్‌పేటలో మాజీ ప్రధాన మంత్రి దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, సిద్దాల దశరథ, చల్లా బాల్‌రెడ్డి, సాయినాథ్ రెడ్డి, బాలమణి, తదితరులు ఉన్నారు.

బడంగ్‌పేటలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, అమరేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బంగారు సత్యనారాయణ, కార్పొరేటర్లు బండారు మనోహర్, ప్రభాకర్ రెడ్డి, రాఘువేందర్ రెడ్డి తదితరులు రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

**కందుకూరులో....**

కందుకూరు, మే 21 : మాజీ ప్రధాన మంత్రి దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేసినట్లు పేర్కొన్నారు. మండల మాజీ అధ్యక్షుడు క్రిష్ణనాయక్,రాణాప్రతాప్‌రెడ్డి, కో ఆర్డినేటర్ అఫ్జల్ భేగ్,సీనియర్ నాయకులు ఢిల్లి శ్రీధర్ ముదిరాజ్,సరికొండ పాండు, గుంద్ర సుధాకర్‌రెడ్డి, బుక్క పాండురంగారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, ప్రశాంత్ కుమార్, యుగేంధర్‌గౌడ్, శేఖర్, బాలయ్య, బాబు, అనిల్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

**ఆర్కేపురంలో...**

ఆర్కేపురం, మే 21 : దేశాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి చేసిన మహోన్నత వ్యక్తి రాజీవ్‌గాంధీ అని సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయిని శంకర్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బేర బాలకిషన్, రాష్ట్ర యువజన నాయకుడు నల్లంకి ధన్‌రాజ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మాజీ ప్రధానమంత్రి దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం మున్సిపల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఇమ్రాన్ అలీ, వక్కలంక శ్రీనివాస్‌రావు, అలీబాయ్, చిక్కుల శివప్రసాద్, తాండ్ర భాస్కర్, చింతకింది రంజిత్, చిన్న ముదిరాజ్, కిశోర్, చిన్న యాదవ్, కర్నాటి శ్రీనివాసులు, అరుణ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

**చంపాపేట డివిజన్‌లో...**

చంపాపేట, మే21: దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ దేశ ప్రజలకు ఆదర్శప్రాయుడని హనుమాన్ ఆలయ పాలకమండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి అన్నారు. మంగళవారం రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని చంపాపేట డివిజన్ పరిధి బైరమాల్‌గూడ చౌరస్తాలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కర్మన్‌ఘాట్ హనుమన్ ఆలయ పాలకమండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి పాల్గొని మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ నారాయణ్ దుర్గారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ప్రకాశ్‌గుప్తా, బద్రినాథ్, తోకటి కిరణ్, గడ్డం వెంకటేశ్, గౌని అనసూయ, కోయిలకొండ సునీల్, తంగెళ్ల యాదగిరి, యంజాల సురేశ్, రాము, పబ్బు జంగయ్యగౌడ్, నోముల రవీందర్‌గౌడ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.